ఏర్పడుతుందో, సరిగ్గా లెక్క కట్టి గోడ కింద భాగంలో అక్కడ తవ్వుతున్నాడు నాగన్న. చీమలు తవ్వుతుంటే అన్నా శబ్దం అవుతుందేమో గాని, నాగన్న తవ్వుతుంటే ఇంతే సంగతులు, చిత్తగించవలెను.

కన్నం పూర్తి అయింది. ఎంత కన్నం?! అడ్డెడు తప్పాల పట్టే అంత కన్నం. నాగన్న బియ్యబ్బస్తా అంత మనిషి. పిల్లులూ, కుక్కలూ-తలుపుల కింద నించీ, గోడల సందుల్లోంచీ, తూముల్లోంచీ శరీరాన్ని యిల కరిచి, సాగలాగుతూ, పాక్కుంటూ, పీక్కుంటూ దూరతాయి చూడండి- అదిగో అల్లా కన్నంలోంచి లోపలికి దూరాడు. దూరుతూ దీపబ్బుడ్డి వెలుతురులో గదిలోకి చూశాడు. పెద్ద గుమ్మడి కాయల్లే పందిరి మంచం మీద పడుకుని ఉన్నాడు కాళయ్యగారు. ఇంకో చిన్న మంచం మీద కత్తి పీటల్లే పడుకుంది గంగమ్మ గారు. చటుక్కున నుంచుని కడియం అందుకుని తిరిగి కన్నంలోకి దూరాడు నాగన్న.

అదే క్షణంలో ...పిల్లి తరుముకు వస్తున్న ఓ చిట్టెలుక గోడవారగా "రయ్యి" మని పరిగెత్తుకుంటూ వచ్చి కన్నంలోకి దూరింది. దూరి కన్నం గోడకీ నాగన్న ఒంటికీ మధ్యన పడి కిచ కిచ లాడింది. ఆ నిశ్శబ్ద నిశీథిలో నాగన్న చెవికి ఆ "కిచకిచ" నిష్ఠా వర్షదమోఘ మేఘపటలీ నిర్గచ్ఛద్ధ్వణ ధణార్భటీ నిస్వాన మల్లే వినబడి హడిలిపోయి శరీరాన్ని మరి కాస్త కుచించాడు. ఎలుక పారిపోయింది. వెంటనే ఏ మాత్రం ఆలస్యం చెయ్య కుండా ముందరి శరీరాన్ని వాయు వేగంతో ముందరికి తోసేశాడు. వెనక శరీరాన్ని కూడా మెరుపు వేగంతో లాగేశాడు, కాని - లోపల మిగిలిన కుడి పాదం తాలూకు బొటన వేలు మాత్రం దేనికో పట్టుకుని యిరుక్కు పోయింది. "అయిపోయామురా భగవంతుడా" అనుకుని బలం అంతా కూడ గట్టుకుని కాలు ఒక్క ఝాడింపు ఝాడించాడు. మామూలుగా అయితే ఆ ఝాడిం పుకి ఓ అడివి పందో, ఎలుగ్గొడ్డో ఎగిరి అవతల పడేది. కాని .....

కాళయ్యగారు ఒట్టి నేల మీద సాష్టాంగంగా పడు కుని ఉన్నాడు.. కూర్చుందామంటే ఎడం చెయ్యి, నేల మీద ఆన్చి లేవాలి. ఆన్చాలంటే పట్టుదొరకాలి. దొరకాలంటే కుడిచేయి సహకరించాలి. కుడిచేయి ఏ మాత్రం సడలినా, దొంగ జారిపోయేటట్టున్నాడు. పైగా ఆముదం కూడా రాసుకొచ్చాడు వెధవ. అయినా అలాగే పడుకుని ఎడం చేయి ఆన్చి లేవడానికి ప్రయత్నిస్తు న్నాడు.

లోపలి ఈ పరిస్థితిని పసిగట్టాడు నాగన్న. నేలని ఉడుముల్లే పట్టి, ఎడంకాలు గోడకి తన్ని పెట్టి, కుడికాలు బ్రహ్మాండ భాండం బద్దలయ్యేటట్టు గుంజుకోసాగాడు.

కాళయ్యగారి కర్థమైంది. "వీడెవడో అసామాన్యుడైన గజదొంగ. అయినా ఫరవాలేదు. కొంచెం కూర్చోవ డానికి పట్టు దొరికితే, కుక్క పిల్లని తోక పుచ్చుకుని లాగినట్లు లాగ్గలను వీడిని ' అనుకున్నాడు.

బయట, ఆ కాస్త పట్టూ వదిలితే సుడిగాలికి కొట్టు కుపోయే పుల్లిస్తరాకల్లే విలవిల్లాడుతున్నాడు నాగన్న.

"చచ్చావులే యినాళ నా చేతిలో వెధవా!" అంటూ కాళయ్యగారు పట్టు మరింత బిగించాడు. బొటన వేలు భగ్గున మండుతోంది నాగన్నకి. ఆ మంట చల్లారడానికి "గంగతల్లీ" అంటూ తమ యిలవేల్పు అయిన కుమార స్వామి యొక్క తల్లిని తలుచుకుంటూ మూలుగు తున్నాడు.

అంతే! లోపల గంగమ్మగారి హృదయం ద్రవించి పోయి, స్వర్గంనుండి శివుడి నెత్తి మీదకి, అక్కడి నుంచి భూమ్మీదకి అడ్డు లేకుండా ఒక్క దూకు దూకింది.

మెల్లిగా లేచి కూర్చోబోతున్న కాళయ్యగారి ఎడం కాలి చీలమండ గట్టిగా పట్టుకుని లాగుతూ బతిమాలు తోంది "అబ్బ! వదిలేద్దురూ వెధవని! వాడిక్కడ ఛస్తే, పాపం వాడి పెళ్ళాం బిడ్డలు అక్కడ ఛస్తారు."

"ఛఫ్! నోరుముయ్యి! వెధవ జాలీ నువ్వూనూ?" కాళయ్యగారి గర్జ.

ఆవిడ చెయ్యి ఆయన కాలి మీద మరి కాస్త బిగుసుకుంది. "అబ్బ! వాడసలే దొంగండీ బాబు! ఏం కత్తులు కటార్లుంటాయో వాడి దగ్గర! మీకు పుణ్య ముంటుంది వదిలేద్దురూ!" ధోరణి మారుస్తూ వేలు పుచ్చుకుని లాగసాగింది మెల్లిగా.

"నీ దుంపతెగ! అసలే పట్టు దొరక్క నేను ఛస్తుంటే, నీ గోలేమిటి మధ్యలో!" అంటూ బలంగా కాలు ఒక్క విదిలింపు విదిలించాడు. మామూలుగా ఆ విదిలింపుకి ఓ అడవి గుర్రమో, మదపుటేనుగో ఎగిరి అవతల పడేది కాని...

"అబ్బ! నా మాట విని యిలా రద్దురూ!" అంటూ పళ్ళు బిగించి ఆ కాలు అలానే పుచ్చుకుని వెనక్కి ఒక్క గుంజు గుంజింది గంగమ్మగారు.

అంతే! ఆ ఊపుకి కాళయ్యగారు జర్రున వచ్చి ఆవిడ ఒళ్ళో పడ్డాడు!! అదే ఊపులో అటు నాగన్న జర్రున పోయి తన గుడిసెలో పడ్డాడు!!!

** ** **

గుఱకొయ్యలు పొడిచే వేళకి చీర సర్దుకుంటూ, జుట్టు ముడేసుకుంటూ, కళ్ళాపి చల్లడానికి వాకిట్లోకి వచ్చింది గంగమ్మగారు. గుమ్మంలో ఓ తట్టా; తట్టలో పట్టుచీరా, రవికల గుడ్డా, పసుపు కుంకుమలు, అరటి పళ్ళగెలా, గెలకి తగిలించిన కడియమూ చూసి, ' ఓరి పిచ్చినాగన్నా! ' అని నవ్వుకుంది.

కాలమ్ దాటిన కథ

ఆరోజు సాయంత్రం 6 1/2 గంటలకు మహబూబాబాద్‌లో గోల్గొండ ఎక్స్‌ప్రెస్ ఎక్కి కూర్చున్నాము నేనూ, నా మిత్రుడూ! కొంతసేపటికి మా దగ్గరికి సమోసాలమ్మే కుర్రాడొచ్చాడు. అతని సత్తు బేసిన్‌లో ఎనిమిదే సమోసాలున్నాయి. 2 రూపాయలిచ్చి ఆ మొత్తం తీసుకొని మేమిద్దరం సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తింటున్నాము. ఖాళీ బేసిన్‌తో సమోసాల కుర్రాడు మా ప్రక్కనే కూర్చుని మా వైపే చూస్తు న్నాడు. మాకు జాలేసింది. అతనికి నోరూరుతుందేమో

ట్రేడ్ సీక్రెట్!

నని ఓ సమోసా అతనికి యివ్వబోయాను. సమిరా తీసుకోలేదు. "ఎంత అభిమానమో యితనికి, అంతా తల్లిదండ్రుల శిక్షణలో వుంటుంది!" అని మెచ్చు కోలుగా నేనూ నా మిత్రుడూ మాట్లాడుకుంటు న్నాము. మా మాటలు విని లేచి వెడుతూ ఆ కుర్రా డిలా అన్నాడు-"సార్! ఆ సమోసాలు రోజూ మానాన్న చేస్తుంటే నేను చూస్తుంటాను, ఎలా తిన గలను సార్!" కళ్ళు తేలేశాం మేము. మా నోట్లో సమోసా లోపలికీ పోక, బయటికీ రాక, అలాగే వుండి పోయింది.

- చిమ్మపూడి శ్రీరామమూర్తి